# 6

# శ్రమనొందుతున్న సేవకుడు

## (యెషయా 53)

దేవుని ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చి తిరిగి వెళ్ళుచున్న ఐతియొపీయ అధికారిని సువార్తికుడైన ఫిలిప్పు కలిసికొనిన సంఘటనను అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయం తెలియజేస్తుంది. అతడు ఆరాధనకు యెరూషలేమునకు వెళ్తూ వస్తున్నాడు కాబట్టి అతడు యూదా మతమును స్వీకరించి యుండవచ్చు. అతడు "దేవునికి భయపడువాడు" అయియుండవచ్చు. వీరు అన్యులేగాని, ఇశ్రాయేలు దేవుని ఆరాధిస్తూ, సమాజమందిర కార్యములలో పాలుపంచుకొనుచున్నవారు. వీరు సున్నతి లేనివారు గనుక వీరు పూర్తిగా యూదా మతములోనికి వచ్చినవారు కారు (చూడు అపొస్తలుల కార్యములు 10:1, 2; 13:26). కాబట్టి ఇతడు హెబ్రీ ప్రవక్త యెషయా గ్రంథమును చదువుటలో ఆశ్చర్యం లేదు. అతడు చదువుతున్న నిర్దిష్ట వాక్య భాగం కూడా మనకు తెలుపబడింది. యెషయా 53:7, 8:

> అతడు దౌర్జన్యము నొందెను
> బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
> వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు
> బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱెయు
> మౌనముగా నుండునట్లు
> అతడు నోరు తెరువలేదు.
> అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను
> అతడు నా జనుల యతిక్రమమునుబట్టి మొత్తబడెను
> గదా.
> సజీవుల భూమిలోనుండి అతడు కొట్టివేయబడెను
> అయినను అతని తరమువారిలో ఈ సంగతి ఆలో
> చించినవారెవరు?

తన రథములో నుండి చదువుచున్న ఐతియోపీయుని ఫిలిప్పు సమీపించి అతనికి అర్థమగునట్లు సహాయం చేస్తాననగా మొదటిగా అతడు – "ప్రవక్త యెవనినిగూర్చి యీలాగు చెప్పుచున్నాడు? తన్ను గూర్చియా? వేరొకని గూర్చియా? దయచేసి నాకు తెలుపుము" అని అడిగాడు (అపొస్తలుల కార్యములు 8:34). తరువాత దీన్ని ఆధారం చేసుకుని, ఫిలిప్పు "యేసును గూర్చిన సువార్తను" అతనికి ప్రకటించినట్లు వాక్యం చెప్తుంది (అపొస్తలుల కార్యములు 8:35).

యేసు క్రీస్తు జన్మించుటకు ఎనిమిది వందల ఏళ్ళ క్రితమే ఆయనను గురించి, ఆయన మరణం గురించి ఒక పాత నిబంధన ప్రవక్త ఎలా వ్రాయగలిగాడు? యెషయా 53ను నిశితంగా పరిశీలిస్తే, దీనికి సమాధానం మనకు దొరుకుతుంది.

## ప్రవచనము యొక్క నేపథ్యము

దావీదు మరణం తర్వాత, ఇశ్రాయేలు సింహాసనం అతని కుమారుడైన సొలొమోను చేతుల్లోకి వెళ్ళింది (1 రాజులు 1; 2). ఈ కాలంలో ఇశ్రాయేలు వృద్ధిచెందింది, శక్తివంతముగా ఎదిగింది. కానీ సొలొమోను పరిపాలన చివరి కాలములో అతడు విగ్రహారాధనను అనుమతించాడు (ప్రోత్సహించాడు కూడ) కాబట్టి ఇశ్రాయేలు శత్రువులను దేవుడు లేవనెత్తాడు (1 రాజులు 11). సొలొమోను మరణం తరువాత, అతని కుమారుడు రెహబాము రాజు అయ్యాడు కానీ అతని అనాలోచన వలన రాజ్యం రెండుగా చీలిపోయింది. దీనివలన రాజ్యము ఉత్తర రాజ్యముగా, దక్షిణ రాజ్యముగా చీలిపోయింది. రెండింటికి వేర్వేరు రాజులు వచ్చారు (దక్షిణ రాజ్యములోనే దావీదు వంశ రాజులు వచ్చారు). ఉత్తర రాజ్యం "ఇశ్రాయేలుగా" పిలువబడగా, దక్షిణ రాజ్యము "యూదాగా" పిలువబడింది. ఎందుకంటే దీనిలో యూదా గోత్రమువారు మరియు బెన్యామీను గోత్రమువారు చేరారు. దేవుని ధర్మశాస్త్రమును విడిచి పెట్టినందును అన్యదేవతల వైపు తిరిగినందుకు రెండు రాజ్యాల వారు అపరాధులుగానే ఉన్నారు. వారు దేవుని వైపు తిరగకపోతే వారి మీదికి అపాయములను గురించి హెచ్చరించడానికి దేవుడు వారియొద్దకు ప్రవక్తలను పంపుతూనే ఉన్నాడు.

క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దము చివరి భాగంలో యూదా మరియు యెరూషలేములోని ప్రజలకు దేవుని వర్తమానమును అందించే ప్రవక్త యెషయా ప్రవక్త (యెషయా 1:1), దావీదు నుండి దాదాపు రెండు శతాబ్దముల తరువాత పని చేసిన ప్రవక్త ఇతడు. ఇశ్రాయేలు చరిత్రలో ఇది ఒక దుర్గతి కాలము. క్రీ.పూ. 722/721లో అష్షూరీయులు ఉత్తర రాజ్యమును (ఇశ్రాయేలు) స్వాధీనపర్చుకున్నారు. దక్షిణ రాజ్యపు (యూదా) పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

దేవుని ధర్మశాస్త్రమును యూదా తిరస్కరించింది కాబట్టి ఆ దేశము మీద దేవుడు రప్పింపబోవు తీర్పును గురించి యెషయాలోని మొదటి 39 అధ్యాయాలు తెలియజేస్తున్నాయి. ఆ వినాశనం క్రీ.పూ. 586లో బబులోను వారి దురాక్రమణ చేత చోటుచేసుకుంది. వారు యెరూషలేము మీద దండెత్తి సొలొమోను నిర్మించిన దేవాలయమును పడగొట్టి పెద్ద సంఖ్యలో ఇశ్రాయేలీయులను తమ స్వస్థలం నుండి బబులోను మరియు ఇతర ప్రాంతాలకు చెరగా తీసుకుపోయారు.

యెషయా 40వ అధ్యాయములో, ఇంతకు ముందటి అధ్యాయముల వలెగాక ఇక్కడ స్వరం, విషయం మారింది. "మీ దేవుడు సెలవిచ్చిన మాట ఏదనగా నా జనులను ఓదార్చుడి ఓదార్చుడి" అని యెషయా 40:1 ప్రారంభమవుతుంది. దేవుడు తన జనాంగమును తిరిగి పునరుద్ధరించుతాడన్న విషయమును యెషయా గ్రంథములోని తరువాతి భాగములో చూస్తాము.

## ప్రవచనములోని విషయము: శ్రమనొందుతున్న సేవకుడు

వాగ్దానం చేయబడిన ఆదరణ, ఓదార్పు దేవుని "సేవకుని" పరిచర్య ద్వారా లభిస్తుందని, ఇశ్రాయేలు ఎందులో విఫలమైందో దానిని అతడు నెరవేర్చుతాడని, ఇశ్రాయేలునకు పూర్వ వైభవం తెస్తాడని యెషయా తెలియజేశాడు. ఆ సేవకుడు ప్రధాన పాత్రగా నాలుగు వాక్య భాగములు కనబడుతున్నాయి. వాటిని "సేవకుని కీర్తనలు" అని పిలుస్తున్నారు. అవి,

యెషయా 42:1-4; 49:1-13; 50:4-11; మరియు 52:13-53:12. అపొస్తలుల కార్యములు 8లోని ఐతియోపీయుడు ఈ ఆఖరి వాక్యభాగంలోని వచనాల చదివాడు.

ప్రత్యేకించి, యెషయా 53 ఆ సేవకుని శ్రమలను వివరిస్తుంది. అతడు దేవుని చేత పంపబడినను, తన స్వంత ప్రజల చేత అతడు తిరస్కరించబడ్డాడు. అతడు పూర్తిగా విడనాడబడిన వాడుగానున్నాడు, అతని యెడల ప్రజలు లక్ష్యముంచలేదు అయినా, అతని శ్రమల మూలముగా ఒక గొప్ప అద్భుతం జరిగింది. ఇతరులు చేసిన అపరాధముల నిమిత్తం అతడు శ్రమనొందాడు. ప్రవక్త మాటల ప్రకారం, ఇదంతా కూడా దేవుని చిత్తమునకనుగుణంగా, ఇతరుల రక్షణ నిమిత్తం జరిగింది. ఆ సేవకుని విధేయతను బట్టి, అతడు తగిన సమయంలో హెచ్చరించబడ్డాడు.

ఇది వ్రాయబడినది ఎన్నో ఏళ్ళకు ముందే అయినను, యెషయా 53వ అధ్యాయం యేసు క్రీస్తు, ఆయన శ్రమలను గురించినదని క్రొత్త నిబంధన గ్రంథకర్తలు ముక్తకంఠంతో అంగీకరించారు. క్రొత్త నిబంధన కోణంలోనుండి చూస్తే, ఇశ్రాయేలు తిరిగి తన పూర్వ వైభవమును సంతరించుకోవడమనేది సైన్య బలము లేదా రాజకీయ అండదండలతో కాదు గాని, దేవుని ఏకైక కుమారుడైన ఆ సేవకుని శ్రమల ద్వారానే. అలాగే ఆ సేవకుడు ఇశ్రాయేలునకు మాత్రమే విమోచకుడు కాడు గాని, అన్ని జనాంగములకు ఆయనే రక్షకుడు. ఆయన ఇచ్చిన విమోచన శరీరక స్వస్థతనుండి ఆత్మీయ రక్షణ వరకు ఇయ్యబడింది. ఆ సేవకుని గుర్తించుటలో ఇశ్రాయేలు వారు విఫలమయ్యారు. గాని, క్రొత్త నిబంధన గ్రంథకర్తలు అది యేసేనని గుర్తించారు.

మత్తయి 8:14-17లో యేసు ప్రభువు పేతురు అత్తను స్వస్థపర్చినప్పుడు చివరిలో, “అందువలన - ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెనని ప్రవక్తయైన యెషయాద్వారా చెప్పబడినది నెరవేరెను” అని చూస్తున్నాం. ఇది యెషయా 53:4లోనిది. అలాగే యేసు కనపరచిన మహత్కార్య వర్తమానము నమ్మినవాడెవడు? ... (యోహాను 12:37బి-41). క్రైస్తవులు తమ విశ్వాసమును బట్టి శ్రమనొందవలెనన్న విషయాన్ని తెలియజేస్తూ యెషయా 53:4లోని వాక్యమును భావార్థముగా ఇస్తున్నాడు, “క్రీస్తుకూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను” (1 పేతురు 2:21). కాబట్టి, ఈ వాక్యములన్నిటిని బట్టి పాత నిబంధన ప్రవక్తలు యేసును గురించే యెషయా 53లో తెలియజేశారని అర్థమవుతుంది.

### ఆయన తిరస్కరించబడడం (53:1-3)

యేసు క్రీస్తు తిరస్కారము నొందుతాడని యెషయా 53 మొదటిసారిగా తెలియజేసింది. అందులోని మొదటి మూడు వచనాలు శ్రమనొందుతున్న సేవకుడు తిరస్కరింపబడుటను గురించినవి. “మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను?” అని మొదటి వచనం ప్రశ్నిస్తుంది. దీనికిగల సమాధానం ఇదే. “అతి కొద్దిమంది” తాను చెప్పిన సందేశాన్ని విన్న యూదులలో అతి కొద్దిమంది మాత్రమే దానిని నమ్మారని రోమీయులకు 10:16లో పౌలు తెలియజేస్తూ ఈ మాటనే ఉదహరిస్తున్నాడు. “అతనికి సురూపమైనను సొగసైనను లేదు. మనమతని చూచి, అపేక్షించునట్లుగా అతనియందు సురూపము లేదు” అని సేవకుని గురించి 53:2 తెలియజేస్తుంది. శారీరప్రకారంగా యేసునందు ఏ ఆకర్షణీయ రూపము లేదు అని

కొంతమంది వ్యాఖ్యానిస్తుండగా, నిజానికి ఆయన సమకాలికులు ఆయనలో ఏముందో దాన్ని వారు గుర్తించలేకపోయారు అన్న అర్థమును ఇది ఇస్తుంది. "అతడు తృణీకరింపబడినవాడును ఆయెను. మనుష్యుల వలన విసర్జింపబడినవాడును, వ్యసనాక్రాంతుడుగాను ... ఉండెను. అతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని ఎన్నికచేయకపోతిమి" అని 3వ వచనం తెలియజేస్తుంది.

ఇదే సంఘటన యేసుని జీవితంలో సత్యముగా జరిగాయని క్రొత్త నిబంధన తెలియజేస్తుంది. యూదుల కొరకు ఆయన మెస్సీయాగావస్తే అనేకమంది యూదులు ఆయన్ను తిరస్కరించారు. నిజానికి, యోహాను సువార్తలోని అనేక పెద్ద ముఖ్య విషయములలో "తిరస్కారము" కూడ ఒకటి. ఇది ప్రారంభ అధ్యాయములోనే స్పష్టమవుతుంది:

> నిజమైన వెలుగు ఉండెను; అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది. ఆయన లోకములో ఉండెను, లోకమాయన మూలముగా కలిగెను గాని లోకమాయనను తెలిసికొనలేదు. ఆయన తన స్వకీయులయొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు (యోహాను 1:9–11).

ఈ వ్యతిరేకత ఇప్పటికీ ఉంది. శ్రమ నొందిన సేవకుడైన యేసు కాలంలోనున్నట్లే ఈ నాడు స్వలాభాపేక్ష, స్వార్థం, స్వప్రయోజనాశ ఈ లోకంలో ఉంది. కాబట్టి ఆయన అనేక మందిచేత తిరస్కరించబడ్డాడు. ఒకవేళ ఆయన ఈ లోకమునకు శక్తివంతుడైన పాలకునిగా; బాగా ధనమున్న నాయకునిగా, నిష్ణాతుడైన ఆటగాడుగా, లేదా ఒక మంచి తలాంతున్న సెలబ్రిటిగా ఈ లోకమునకు వచ్చియుంటే, ఆయనకు ఎంతోమంది అభిమానులుండేవారు. రెండువేల ఏళ్ళ క్రితం యెషయా 53లోని శ్రమనొందిన సేవకుడు ప్రఖ్యాతి గాంచిన ప్రముఖుడు కానట్లే ఈనాటికి ఆయన అనేకమందికి "ప్రముఖుడు" కాదు.

### ఆయన మన పక్షమున ఘోరమైన శ్రమనొందడం (53:4–6)

యేసు ఇతరలు నిమిత్తం శ్రమపొందుతాడని కూడా యెషయా 53 తెలియజేస్తుంది. సేవకుడు యితరుల నిమిత్తం, ప్రవక్త నిమిత్తం కూడా శ్రమ పొందుతాడని 4నుండి 6 వచనాలు వివరిస్తున్నాయి. ఈ వాక్య భాగమును జాగ్రత్తగా గమనిస్తే "మన" అనే మాట పదిసార్లు పేర్కొనబడింది. "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను ... మన దోషములను బట్టి నలుగగొట్టబడెను ... యెహోవా మనయందరి ప్రాయశ్చిత్తం" అని పిలుస్తున్నారు. అంటే మనం భరించవలసిన శిక్షను యేసు తనపై వేసుకుని మనకు బదులుగా ఆయన శిక్షననుభవించాడు. సిలువలో ఆయన శ్రమను పొంది మరణమగుట ద్వారా మనం అనుభవించవలసిన దానిని మన తరపున ఆయన అనుభవించాడు.

మానవుల తరపున సిలువలో యేసుని మరణం గురించి క్రొత్త నిబంధన యిలా బోధిస్తుంది:

> మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయనతానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి (1 పేతురు 2:24).

నా చిన్న పిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు శాంతికరమైయున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమైయున్నాడు (1 యోహాను 2:1, 2).

మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను. మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది. ప్రియురాలా, దేవుడు మనలను ఈలాగు ప్రేమింపగా మనమొకనినొకడు ప్రేమింపబద్ధులమై యున్నాము (1 యోహాను 4:9–11).

ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతునికొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరుచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమైయుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయనద్వారా ఉగ్రతనుండ రక్షింపబడుదుము (రోమీయులకు 5:6–9).

క్రీస్తు మనకొరకు శ్రమనొంది చనిపోయాడన్న సువార్త సత్యమును మన హృదయములకు అన్వయింపబడాలి. ఈ విషయాన్ని మరింత అర్థంచేసుకోవడానికి, యెషయా 53లోని మాటలకు ప్రథమ పురుష, ఏక వచనమును పెట్టి మరింత వ్యక్తిగతంగా అన్వయించుకొనవచ్చు: "నిశ్చయముగా అతడు *నా* రోగములను భరించెను … *నా* సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను … అతడు పొందిన దెబ్బల చేత *నాకు* స్వస్థత కలుగుచున్నది."

### ఆయన అవమానమునొందుట (53:7–9)

అంతేగాక, యేసు క్రీస్తు అన్యాయముగా శ్రమనొందుతాడని కూడా యెషయా తెలియజేశాడు. ఇతరుల నిమిత్తం శ్రమనొందునప్పుడు సేవకుడు ఎంత అన్యాయముగా తీర్చబడతాడో 7 నుండి 9 వచనాలు తెలియజేస్తున్నాయి. అతడు అణగద్రొక్కబడి బాధపర్చబడేది తను చేసిన పనులకు కాదని యెషయా తెలియజేస్తున్నాడు. అతని బలి అర్పణలో ఆయన సహజమైన వైఖరి వెల్లడవుతుంది. ఆయన బాధపరచబడినా గాని "ఆయన నోరు తెరువలేదు" అని 7వ వచనం వివరిస్తుంది. "అతని ప్రాణము అతనినుండి తీసివేయ బడింది. ఆఖరికి ఆయన సమాధి కూడా దయనీయముగానున్నది." "నిశ్చయముగా అతడు అన్యాయమేమియు చేయలేదు. అతని నోట ఏ కపటమును లేదు" (53:9; ESV).

రోమా గవర్నరైన పిలాతు ఎదుటికి, యేసు వచ్చినప్పుడు ఆయన అన్యాయ పరిస్థితిని ఇదే వివరణను లూకా కథనంలో చూడగలం. ఆయనకు వ్యతిరేకంగా ప్రధాన యాజకులు, వారి అనుచరులు ఎన్ని ఆరోపణలు చేసినను, పిలాతు మాత్రం "ఈ మనుష్యునియందు నాకు ఏ నేరమును కనబడలేదు" (లూకా 23:4) అని తేల్చాడు. తరువాత విమర్శ నిమిత్తం యేసును హేరోదు నొద్దకు పంపించిన తరువాత పిలాతు ప్రధానయాజకులను, యూదుల

అధికారులను పిలువనంపి యిలా అన్నాడు,

> అంతట పిలాతు ప్రధానయాజకులను అధికారులను ప్రజలను పిలిపించి – ప్రజలు తిరుగబడునట్లు చేయుచున్నాడని మీరీమనుష్యుని నా యొద్దకు తెచ్చితిరే. ఇదిగో నేను మీయెదుట ఇతనిని విమర్శింపగా మీరితని మీద మోపిన నేరములలో ఒక్కటైనను నాకు కనబడలేదు; హేరోదునకు కూడ కనబడలేదు. హేరోదు అతని మా యొద్దకు తిరిగి పంపెను గదా; ఇదిగో మరణమునకు తగినదేదియు ఇతడు చేయలేదు (లూకా 23:13–16).

అందుకు యూదులు యేసును శిక్షించి బరబ్బను విడుదల చేయమని ఒత్తిడి తెచ్చినప్పుడు పిలాతు ఆశ్చర్యపడి, అసహనముతో "–ఎందుకు? ఇతడు ఏ దుష్కార్యము చేసెను? ఇతనియందు మరణమునకు తగిన నేరమేదియు నాకు అగపడలేదు గనుక ఇతని శిక్షించి, విడుదల చేతునని వారితో చెప్పాడు" (లూకా 23:22). అయితే పిలాతు వారి ఒత్తిడికి తలొగ్గి బరబ్బాను విడుదల చేసి యేసును సిలువకు అప్పగించాడు.

దీన్ని చదువుతుండగా ఇందులోని అన్యాయమును బట్టి మనం కలత చెందుతాము. కానీ ఇదే ముఖ్య విషయం. రక్షణ అనేది న్యాయమును బట్టిగాక, కృపను బట్టి అనుగ్రహించ బడింది. మన పాపముల నిమిత్తం మనమే శిక్షనొందాలని న్యాయము కోరుతుంది కానీ సిలువను బట్టి మనం రక్షించబడుతున్నాము. యేసు తాను పొందుటకు అర్హుడు కాకపోయినా, ఆ శిక్షను సంతోషంగా భరించాడు. జరగబోతున్న ప్రతి విషయమును యెషయా ముందే గ్రహించాడు.

### ఆయన మహిమ పరచబడడం (53:10–12)

యెషయా ప్రకారం, యేసుని శ్రమలు ఆయన మహిమకు కారణమయ్యాయి. శ్రమపడుతున్న సేవకుడని అలాగే శ్రమలలోనే యెషయా 53వ అధ్యాయం విడిచిపెట్ట లేదు. అధ్యాయంలోని ఆఖరి మూడు వచనాలలో మనకు నిరీక్షణార్థమైన వాగ్దానాలు కనబడుతున్నాయి:

> అతడు తన్నుతానే అపరాధపరిహారార్థబలిచేయగా అతని సంతానము చూచును.
> అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెహోవా ఉద్దేశము అతనివలన సఫలమగును.
> అతడు తనకు కలిగిన వేదనను చూచి తృప్తినొందును.
> నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషములను భరించి
> తనకున్న అనుభవజ్ఞానముచేత
> అనేకులను నిర్దోషులుగా చేయును.
> కావున గొప్పవారితో నేనతనికి పాలు పంచిపెట్టెదను
> ఘనులతో కలిసి అతడు కొల్లసొమ్ము విభాగించుకొనును.
> ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను
> అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను
> అనేకుల పాపమును భరించుచు
> తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనముచేసెను (53:10బి–12).

తరువాత కాలంలో, యేసుని శ్రమల ఫలితమును గురించి రోమీయులకు 4:1–8లో పౌలు వివరిస్తూ ఇదే విషయాన్ని వివరిస్తున్నాడు. మనం పాపులమై నిత్య దండనను

మనం పొందవలసియుండగా క్రీస్తునందలి విశ్వాసం ద్వారా మనం నీతిమంతులుగా తీర్చబడుచున్నామని అతడు తెలియజేస్తున్నాడు. యెషయా 53లోని ఆఖరి మూడు వచనాలలోను అంతర్లీనంగా ప్రభుని పునరుత్థానమును గురించిన ప్రవచనం ఉంది, "సజీవుల భూమిలోనుండి అతడు కొట్టివేయబడినను" (53:8), భవిష్యత్తులో "అతడు తన సంతానము చూచును." "అతడు తనకు కలిగిన వేదనను చూచి తృప్తినొందును" అని 11వ వచనం తెలియజేస్తుంది. ఆయన జరిగించిన కార్యమును బట్టి ఆయన ఘనపరచబడును ("గొప్పవారితో నేనతనికి పాలు పంచిపెట్టెదను"; 53:12ఎ). యేసుని కార్యం తరువాత దానిని గురించి పౌలు ఫిలిప్పీయులకు 2:9–11లో వ్రాసిన వాక్యమునకు ఇది సరిపోతుంది:

> అందుచేతను పరలోకమందున్న వారిలో గాని భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలోగాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను.

దీన్నిబట్టి శ్రమనొందుతున్న సేవకుని గురించి యెషయా చెప్పిన మాటలు సిలువలో యేసుని గురించేనన్న విషయం స్పష్టమవుతుంది. ఆయన ఎటువంటి శ్రమను మనకొరకు అనుభవించాడోనన్న విషయాన్ని మాత్రమే ఇది తెలియజేయడం లేదు గాని, ఆయన మన నిమిత్తం జరిగించిన కార్యమును కూడా తెలియజేస్తుంది.

### మన నిమిత్తం ప్రవచన సందేశం

క్రొత్త నిబంధనకు సంబంధం గల ఏ పాత నిబంధన వాక్య భాగము అయినా సహజంగానే క్రైస్తవులకు ఒక సందేశాన్నిస్తుంది.

*మన రక్షణ ఎంతో వెల యిచ్చి కొనబడినది.* బహుశ యెషయా 53నే పేతురు మనస్సులో నుంచుకుని ఈ వాక్యమును వ్రాసియుంటాడు,

> పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదుగాని, అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా (1 పేతురు 1:18, 19).

రక్షణ యొక్క ఆశీర్వాదములను స్వతంత్రించుకున్నవారు, అమూల్యమైన రక్షణను నిర్లక్ష్యం చేయకూడదు (చూడు హెబ్రీయులకు 2:1–3).

*మనం వెలబెట్టి కొనబడ్డాము కాబట్టి మన జీవితాలు మన స్వంతం కాదు.* యేసు ప్రభువు మనకోసం ఎంతో చేశారు కాబట్టి, మనకియ్యబడిన దానిని బట్టి మన ఋణం ఎన్నటికీ తీర్చబడనిది. అయితే మనం చేయగలిగినదల్లా ఒక్కటే, ఇదంతా చేసినందుకు మనం దేవున్ని సేవించాలి, క్రీస్తును మహిమపరచాలి, పౌలు ఈ విధంగా వ్రాస్తున్నాడు,

> మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి (1 కొరింథీయులకు 6:19, 20).

దుర్నీతిని ఖండిస్తూ చెప్పబడిన మాటల నేపథ్యంలో ఈ వాక్యము వ్రాయబడింది. మనము వెలపెట్టి కొనబడినవారము గనుక మనము కొన్నింటిని చేయకూడదు. మనం క్రీస్తుకు చెందినవారము గనుక మనం కొన్ని పనులను చేయాలి. (క్రైస్తవులకు అనుకూలమైనవి, అనానుకూలమైనవాటి కొరకు ఎఫెసీయులకు 5 మరియు 6 చూడండి.)

*శ్రమపడుట అనేది విజయానికి దేవుని మార్గము.* సహజంగా, మనం తలంచే విధానమునకు ఇది విభిన్నమైనది. సిలువ మరియు యేసుని పునరుత్థానము ఈ వివాదమును తీర్చగలిగాయి. యేసు క్రీస్తు మహిమపర్చబడ్డాడు ఎందుకంటే, ఈ లోకమును రక్షించుటకు ఆయన దేవుని ప్రణాళిక చొప్పున శ్రమననుభవించాడు. కాబట్టి పౌలు తన శిష్యుడైన యౌవ్వనస్థుడు తిమోతితో, "దేవుని శక్తినిబట్టి సువార్తనిమిత్తమైన శ్రమానుభవములో పాలివాడవైయుండుము" (2 తిమోతి 1:8) అని సూచన చేస్తున్నాడు. శ్రమపడమని పౌలు ఎందుకు తిమోతిని ప్రోత్సహిస్తున్నాడు? ఎందుకంటే, ఇలాగే ఒకరు క్రీస్తునొద్దకు నడిపించ బడతారు. ఒకరు మనస్ఫూర్తిగా, క్రీస్తును అనుసరిస్తూ, క్రీస్తు సందేశాన్ని ఒకరి యొద్దకు తీసుకువెళ్ళుటకు ఎంత శ్రమనైనా అనుభవించగలుగుతారు. మనం సువార్త నిమిత్తం మన సమయం, శక్తి, ధనం, కష్టమును వెచ్చించుటకు ఇష్టపడకపోతే, దేవుని నిమిత్తం మనం ఫలభరితముగా ఉండలేము. ఇందుకు గల సులభ మార్గమంటూ ఏదీ లేదు. అలాగే మన ఆత్మీయాభివృద్ధిలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది: "సిలువ లేనిదే కిరీటం ఉండదు."

శ్రమపడుతున్నామంటే, దేవుడు మన యెడల అయిష్టముగానున్నాడని కాదు. ఎవరికైనా జీవితంలో దుర్ఘటనలు ఎదురైనప్పుడు, రోగం లేదా మరిదేన్నయినా కోల్పోయినప్పుడు, వారు దేవునికి వ్యతిరేకంగా ఏదో చేసి ఆయనకు కోపం పుట్టించామన్న భావనలో ఉంటారు. మన వాదమునకు బలం చేకూర్చడం కోసం అతి నీతిమంతుడైన యేసు కూడా తన తప్పిదములను బట్టి తండ్రి చేత శిక్షించబడ్డాడు అని వాదిస్తుంటాము. నిజానికి, శ్రమపడుటకే దేవుడాయనను పంపించాడు. ఇంకా చెప్పాలంటే, ప్రజలు తాము చేసిన చెడుకార్యముల కంటే, తాము చేసిన నీతిక్రియల మూలముగానే వారు శ్రమపడతారు.

క్రీస్తు నొద్దకు రావడం ద్వారానే మనం శ్రమను అనుభవించుతాము. దేవుని శ్రమపడుతున్న సేవకుడు యేసు పొందిన అన్యాయపు శ్రమ, తిరస్కారము, ఆయన సారూప్యములోనికి మారుతున్న మనకు కూడా ఎదురవుతుంది. సిలువ వేయబడిన సేవకుని అనుసరించుటను అనేకమంది ఆహ్వానించరు గాని. వారి తిరస్కారము మనమాయన్ను అనుసరించుటకు ఆటంకము రాకూడదు. మనం పొందిన శ్రమను సహించుట దాని వెల, విలువ అమూల్యమైనది. "యేసు తనకు కలిగిన వేదన" (11 వచనం) ప్రతిఫలమును చూడగలిగాడు. అలాగే మనం కూడ చూడగలము. పొందబోయే శ్రమలను గూర్చిన భయము క్రీస్తు మనకు అనుగ్రహించు వాటిని దూరం చేస్తుంది. కాబట్టి మనం భయపడకూడదు.

యెషయా 53ను చదివిన తరువాత ఐతియోపీయుడు అడిగిన ప్రశ్న ఎంతో మంచిది: "ప్రవక్త యెవనిని గురించి యీలాగు చెప్పుచున్నాడు?" క్రొత్త నిబంధనను చదివిన తరువాత మనకు సమాధానం దొరుకుతుంది. "యేసు, మనకొరకు శ్రమననుభవించి మనందరి నిమిత్తం చనిపోయాడు."

## యేసు, పరిపూర్ణమైన పాపపరిహారార్థ బలి

శ్రమనొందుతున్న సేవకుని నిర్దోషత్వమును గురించి యెషయా 53లో చెప్పబడిన విషయం క్రొత్త నిబంధనలోని మరో ఆవిష్కరణను వివరిస్తుంది. అది ఏమిటంటే, అతడు (యేసు) పూర్తిగా మానవుడు (పూర్తిగా దైవికము కూడాను యోహాను 1:1; కొలొస్సయులకు 2:9; హెబ్రీయులకు 1:8), అయినను ఆయన పాపం లేకుండగానున్నాడు.

యేసు క్రీస్తు తన పరిచర్యను ఆరంభించకముందు నలభై దినాలు ఆయన అరణ్యములో శోధన కాలాన్ని ఎదుర్కొన్నాడు. అక్కడే ఆయన, సాతానుడు తనకు ఇచ్చిన అవకాశములను తిరస్కరించాడు (మత్తయి 4:1–11; లూకా 4:1–13). "ఎందుకనగా మనమాయనయందు [దేవునియందు] దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను [క్రీస్తును] మన కోసము పాపముగా చేసెను" (2 కొరింథీయులకు 5:21) అని పౌలు వ్రాస్తున్నాడు. "మన కోసము పాపముగా చేసెను" అన్న మాటకు అర్థం. ఆయన పాపము విషయంలో అపరాధి అని కాదు గాని లోక పాపముల విషయంలో వాటి దుష్పరిణామాలను ఆయన మోశాడని అర్థం. అలాగే 1 యోహాను 3:5లో యిలా వ్రాయబడింది "పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును; ఆయనయందు పాపమేమియు లేదు."

శ్రమలలో ప్రతీకారం గాకుండా సహించడం నేర్చుకోవాలని పేతురు విశ్వాసులను సూచిస్తూ, యేసును గురించు "ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు" (1 పేతురు 2:22) అని తెలియజేస్తున్నాడు.

యేసు పాపరహితుడు అని నిశ్చితంగా తెలియజేస్తున్న వాక్యము హెబ్రీయులకు 4:15లో కనబడుతుంది: "మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను."

యేసును పాపరహితునిగా మనం గుర్తించినప్పుడు ఆయన ఒక్కడే పరిపూర్ణమైన పాపపరిహారార్థబలి అని మనకు అవగతమవుతుంది. ఈ బలికి మోషే ధర్మశాస్త్రములో అవసరమైన (లేవీయకాండము 3; 4) "నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్ల" (1 పేతురు 1:19) క్రీస్తే.